క్లుప్తంగా

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన మంత్రి

అడ్డాకుల: మండలంలోని బలీదుపల్లి గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్‌ మండల ఎస్సీ సెల్‌ అధ్యక్షుడు వీరస్వామి అనారోగ్యానికి గురై మృతి చెందడంతో బాధిత కుటుంబాన్ని మంగళవారం రాత్రి రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పరామర్శించారు. వీరస్వామి మృతదేహం వద్ద నివాళులర్పించి రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. బుధవారం మాజీ మంత్రి డాక్టర్‌ చిన్నారెడ్డి వీరస్వామి మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. జెడ్పీటీసీ రాజశేఖర్‌రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. అదేవిధంగా 1999–2000 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థులు రూ.54వేల నగదును మృతుని భార్యకు అందజేశారు. ముత్యాలంపల్లి సర్పంచ్‌ సుజాతప్రతాప్‌రెడ్డి రూ.2వేల ఆర్థిక సాయం అందజేశారు.

చిత్రకారుడికి అభినందనలు

స్టేషన్‌ మహబూబ్‌నగర్‌: తెలంగాణ సారస్వత పరిషత్‌ ఆధ్వర్యంలో ప్రచురించిన 'బాలకథా సౌరభం' పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం బుధవారం హైదరాబాద్‌లో నిర్వహించారు. ఈ పుస్తకానికి 10 అంశాలపై బొమ్మలను చిత్రించిన జిల్లాకు యువ చిత్రకారుడు జేపీ.మహేష్‌ను కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారులు కేవీ.రమణాచారి, పద్మభూషణ్‌ డాక్టర్‌ వరప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్‌, సారస్వత పరిషత్‌ అధ్యక్షుడు ఎల్లూరి శివారెడ్డి, ప్రధాన కార్యదర్శి డాక్టర్‌ జె.చెన్నయ్య తదితరులు అభినందించారు.

ఆలయాభివృద్ధికి విరాళం

అడ్డాకుల: మూసాపేటలోని సంకల్పసిద్ధి హరిహర అయ్యప్ప క్షేత్రం అభివృద్ధికి కర్ణాటకలోని గుర్మిట్కల్‌ మండలం కందుకూరుకి చెందిన నీలమ్మ, విరుపాక్ష షష్టిపూర్తి సందర్భంగా వారి కోడలు జ్యోతి, నగేష్‌లు బుధవారం ఆలయానికి వచ్చి రూ.51 వేలను విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు వారిని శాలువాలతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. సేవా సమితి అధ్యక్షుడు నల్ల తిరుపతయ్యగౌడ్‌, గౌరవ అధ్యక్షుడు శెట్టిశేఖర్‌, విశ్వేశ్‌నాథ్‌, నగేష్‌నాథ్‌, కొండయ్య, ప్రభాకర్‌, ముక్త నగేష్‌, ప్రవీణ్‌ తదితరులు ఉన్నారు.

పూర్వవిద్యార్థుల చేయూత

మిడ్జిల్‌: మండల కేంద్రానికి చెందిన పదో తరగతి(1997–1998) పూర్వ విద్యార్థులు బుధవారం మిడ్జిల్‌కు చెందిన బాలమణి అనారోగ్యంతో బాధపడుతుండగా ఆమెను పరామర్శించారు. రూ. పదివేలు ఆర్థికసాయం చేశారు. అనిత, అనురాధ, సువర్ణ, పుష్పలత, యాదమ్మ, జ్యోతి, శోభ, రాజేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

చెక్కుల అందజేత

నవాబుపేట: ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి చొరవతో మండలంలో వివిధ గ్రామాలకు చెందిన 10 మంది లబ్ధిదారులకు సీఎం రిలీఫ్‌ఫండ్‌ చెక్కులు అందిరిచినట్లు ఎంపీపీ అనంతయ్య, సింగిల్‌విండో చైర్మన్‌ నర్సింహులు బుధవారం తెలిపారు. గోపాల్‌, చంద్రకాంత్‌, శ్రీశైలం, నర్సింహులు తదితరులు ఉన్నారు.

నర్సింగ్‌ విద్యార్థిని అదృశ్యంపై కేసు నమోదు

మహబూబ్‌నగర్‌ క్రైం: నర్సింగ్‌ విద్యార్థిని అదృశ్యమైన ఘటనపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్‌ ఎస్‌ఐ జగన్నాథం తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. నీసీకుంట మండలం పర్దిపూర్‌నకు చెందిన శ్వేత జిల్లా కేంద్రంలోని పాత పాలమూరులోని అమ్మమ్మ ఇంట్లో ఉంటూ నర్సింగ్‌ శిక్షణ తీసుకుంటోంది. అ యితే ఈనెల 21న ఉదయం 10గంటల ప్రాంతంలో బయటకు వెళ్తున్నానని చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో చుట్టుపక్కలా, బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. ఆమె తండ్రి ఆంజనేయులు తన కుమార్తె కన్పించకుండాపోవడానికి నరేష్‌ అనే యువకుడిపై అనుమా నం ఉందని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు న మోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రైస్‌మిల్లుకు ధాన్యం నిలిపివేత

మహమ్మదాబాద్‌: వరిధాన్యం సేకరణలో మోసాలకు పాల్పడుతున్నారని మండల కేంద్రానికి చెందిన లక్ష్మీబాలాజీ రైస్‌మిల్లుకు వరిధాన్యం నిలిపివేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బుధవారం ఎన్‌ఫోర్స్‌మెంట్‌ డీటీ ఆదిత్యగౌడ్‌ ఆధ్వర్యంలో రైస్‌మిల్లుకు ధాన్యం వెళ్లకుండా నిలిపివేశారు. అక్కడికి వెళ్లిన సుమారు 40 లారీల వరకు ధాన్యం ఇతర రైస్‌ మిల్లులకు తరలించినట్టు తెలిపారు. కాగా మిల్లులో యాజమాన్యం అధిక మోసాలకు పాల్పడుతూ బస్తాకు రెండు కిలోలు తరుగు తీస్తున్నారన్న రైతుల ఫిర్యాదు మేరకు కలెక్టర్‌, ఉన్నతాధికారుల ఆదేశాలతో చర్యలు తీసుకున్నామని వివరించారు. కాగా సదరు రైస్‌మిల్లు ఇప్పటికే దాదాపు రెండు లక్షల బస్తాలకు పైగా ధాన్యాన్ని సేకరించింది. దీంతో రైతులు లక్షల్లో నష్టపోయారు. ప్రస్తుతం ప్రభుత్వం ఉన్నతాధికారులు తీసుకున్న నిర్ణయం మేరకు ఇప్పటికైనా తరుగు తీయడం నిలిపివేస్తారా? గతంలో తీసుకున్న తరుగును మిల్లర్ల నుంచి రైతులకు చెల్లిస్తారా ? అన్నది ప్రశ్నార్థకంగా మారింది.



నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరి

- ధాన్యం కొనుగోలు ధ్రువీకరణలో అవకతవకలకు పాల్పడితే చర్యలు
- కలెక్టర్‌ రవినాయక్‌



అధికారులతో సమీక్షిస్తున్న జిల్లా కలెక్టర్‌ రవినాయక్‌

జెడ్పీసెంటర్‌(మహబూబ్‌నగర్‌) : నగటు నాణ్యతా ప్రమాణాలు లేకుండా ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు ధ్రువీకరించినట్లయితే వ్యవసాయ అధికారులపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్‌ జి. రవి నాయక్‌ హెచ్చరించారు. కలెక్టరేట్‌లో పౌర సరఫరాల శాఖ అధికారులతో బుధవారం సమీక్షించారు. ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారమే ధాన్యం ఉండాలని, అలాంటి ధాన్యాన్నే కొనుగోలు చేసేందుకు ధ్రువీకరించాలని అన్నారు. ధ్రువీకరణకు సంబంధించి ఎక్కడైనా పనిభారం ఎక్కువగా ఉన్నచోట వ్యవసాయ సహాయ సంచాలకులు సైతం పనిని పర్యవేక్షించాలని జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేష్‌ను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో అధికారులు తిరిగి కొనుగోలు కేంద్రాలకు తెచ్చే ధాన్యం ఉండాల్సిన తీరుపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు ఉంటాయన్నారు. కొనుగోలులో రా రైస్‌ మిల్లులు భాగస్వామ్యం అయ్యేలా చర్యలు తీసుకోవాలని, వీఆర్‌ఏలను ధాన్యం కొనుగోలుకు సంబంధించి మిల్లుల వద్ద నియమించాలని అన్నారు. అంతకుముందు మంత్రి గంగుల కమలాకర్‌ హైదరాబాద్‌ నుంచి నిర్వహించిన వీసీలో మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకున్న చర్యల వల్లే రాష్ట్రంలో వరి విస్తీర్ణం , దిగుబడి పెరిగిందన్నారు. ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. గత సంవత్సరం కంటే అధికంగా కొనుగోలు చేశామనన్నారు. గత సంవత్సరం 4.5 లక్షల మందిని నుంచి 28 లక్షల 50 వేల మెట్రిక్‌ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేస్తే ,ఈ సంవత్సరం మే 23 నాటికి 6.4 లక్షల మంది రైతుల నుంచి 38 లక్షల 50 వేల మెట్రిక్‌ టన్నులు ధాన్యాన్ని కొనుగోలు చేశామని, 450 కొనుగోలు కేంద్రాలు అధికంగా ప్రారంభించామని మంత్రి తెలిపారు. తడిసిన ధాన్యాన్ని సైతం రైతులు నష్ట పోవద్దనే ఉద్దేశంతో కొనుగోలు చేశామని తెలిపారు. జిల్లాల్లో రైస్‌ మిల్లుల వద్ద ధాన్యం దిగుబడికి స్థల సమస్య ఉందని, దీనివల్ల లారీల మూమెంట్‌, మిల్లుల వద్ద ధాన్యం దిగుబడి ఆలస్యం అవుతుందని, నివారించేందుకు ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని గోడౌన్లో భద్రపరచాలని, జిల్లాలో ఇంటర్మీడియట్‌ గోడౌన్లను గుర్తించాలని సూచించారు. మిల్లుల అధిక సంఖ్యలో హమాలీలను ఏర్పాటు చేసుకోవాలని, జిల్లాల వారీగా అవసరమైతే లారీల సంఖ్యను పెంచాలని వివరించారు. అడిషనల్‌ కలెక్టర్‌ కే సీతారామారావు, జిల్లా పౌర సరఫరాల మేనేజర్‌ ప్రవీణ్‌, పౌరసరఫరాల అధికారి వి.బాలరాజు,జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేష్‌, డీఆర్‌డీఓ యాదయ్య, ఏపీడీ శారద తదితరులు హాజరయ్యారు.

ప్రభుత్వ పనులకు ప్రాధాన్యత

జెడ్పీసెంటర్‌(మహబూబ్‌నగర్‌): ఇసుక సరఫరాలో ప్రభుత్వ పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్‌ జి.రవి నాయక్‌ అన్నారు. గుర్తించిన ప్రభుత్వ ఇసుక రీచ్‌లు, ఆయా మండలాలలో గుర్తించిన పట్టా భూముల్లో ఇసుక తవ్వకానికి సంబంధించి పూర్తి వివరాలను సమర్పించాలన్నారు. తన క్యాంపు కార్యాలయంలో బుధవారం నిర్వహించిన జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

విగ్రహాల ప్రతిష్ఠాపన ఉత్సవాలు



పూర్ణాహుతిలో పాల్గొన్న ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

భూత్పూర్‌: మండలంలోని తాటికొండ నెహ్రూనగర్‌ కాలనీలో బుధవారం నిర్వహించిన విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాల్లో దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. గ్రామంలోని కాశీ విశాలక్షి సమేత విశ్వనాథ, ఆంజనేయ స్వామి దేవస్థానం వద్ద గణపతి, సుబ్రమణ్య స్వామి, నందీశ్వర, విశాలక్షి, శిఖరాల, నవగ్రహాలు, నాభిశిల (బొడ్రాయి), ధ్వజస్తంభం, గండదీప స్తంభాల ప్రతిష్ఠాపన నిర్వహించారు. కలశ ఊరేగింపు చేపట్టారు. సర్పంచ్‌ సాయికుమార్‌, మున్సిపల్‌ చైర్మన్‌ బస్వరాజ్‌ గౌడ్‌, సీనియర్‌ నాయకులు నారాయణ గౌడ్‌, కౌన్సిలర్‌ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జూలపల్లిలో..

మహమ్మదాబాద్‌: మండల పరిధిలోని జూలపల్లి గ్రామంలో రెండు రోజులుగా గ్రామ దేవతల ప్రతిష్ఠ ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. రెండోరోజు బుధవారం ఆంజనేయస్వామికి ప్రత్యేక అభిషేకం, గ్రామ దేవతల ధాన్యా, జలాదివాసములు, దంపతులచే యజ్ఞ కార్యక్రమాలు అనంతరం తీర్థప్రసాదములు, అన్నదాన కార్యక్రమం చేపట్టారు. సర్పంచ్‌ కిరణ్‌కుమార్‌ ఆధ్వర్యంలో ఆలయ కమిటీ సభ్యులు అన్నదాత కిష్టారెడ్డి కుటుంబీకులకు సన్మానించారు.

మహబూబ్‌నగర్‌ రూరల్‌ : మండల పరిధిలోని ధర్మాపూర్‌లో బొడ్రాయి, కోట మైసమ్మ, నాగుల విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ దేవతా విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా యాగశాలలో కోట మైసమ్మ, నాగులు, బొడ్రాయిల ప్రతిష్ఠాపన సందర్భంగా వేదపండితులు గణపతి పూజ, పుణ్యావాహచనం, షోడశస్తంభపూజ, అంకురారోపణ, అగ్ని ప్రతిష్ఠ నిర్వహించారు. అనంతరం గ్రామంలోని శ్రీ ఆంజనేయస్వామి సమీపంలో బొడ్రాయి, ప్రాథమిక పాఠశాల వద్ద కోట మైసమ్మ విగ్రహం, నాగులకుంట చెరువు వద్ద నాగుల విగ్రహాలను ప్రతిష్ఠాపన చేపట్టారు. మహిళలు నీటితో అభిషేకాలు , సాయంత్రం బోనాలతో ఊరేగింపు నిర్వహించారు.శ్రీనివాస్‌గౌడ్‌ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు చేయించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌ బి.రాజేశ్వర్‌గౌడ్‌, ఎంపీపీ సుధాశ్రీ, జెడ్పీటీసీ సభ్యురాలు పి.వెంకటేశ్వరమ్మ, ఎంపీటీసీ సభ్యుడు రవీందర్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్‌ రాజేశ్వర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ఆదర్శ డిగ్రీ కళాశాల వార్షికోత్సవం

మహబూబ్‌నగర్‌ ఎడ్యుకేషన్‌: జిల్లా కేంద్రంలోని ఆదర్శ డిగ్రీ కళాశాలలో బుధవారం వార్షికోత్స వం ఘనంగా నిర్వహించారు. ఈమేరకు పలువురు విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్‌ శ్రీనివాసరావు మాట్లాడారు. విద్యార్థులు నిర్దిష్ట లక్ష్యంతో చదివితే జీవితంలో ఉన్నతంగా ఎదుగుతారన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



నృత్యం చేస్తున్న విద్యార్థులు

త్వరలో రైల్వే సాంకేతిక బృందం పరిశీలన

దేవరకద్ర: రైల్వే గేటు మూసి వేయడం వల్ల వ్యాపారులు, రైతులు, ప్రజలు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సూచన మేరకు డీఆర్‌ఎమ్‌ శరత్‌ చంద్రయాన్‌ను కలిసి వినతి పత్రం ఇచ్చామని బీజేపీ పాలమూర్‌ పార్లమెంట్‌ సభ్యుడు డోకూర్‌ పవన్‌కుమార్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శాశ్వత పరిష్కారం చూపే విధంగా త్వరలో రైల్వే సాంకేతిక బృందం వచ్చి పరిశీలన చేయడానికి డీఆర్‌ఎమ్‌ సానుకూలంగా స్పందించారని తెలిపారు. రెండు మూడు రోజుల్లో వచ్చే అవకాశం ఉందన్నారు.

అంబలి కేంద్రం ఏర్పాటు

అడ్డాకుల: కందూర్‌లో పుష్పమ్మ, హన్మయ్యల స్మారకార్థం వారి కుమారుడు, బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి మున్నూర్‌ రమేష్‌ బుధవారం గ్రామంలో అంబలి కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఉప సర్పంచ్‌ శంకర్‌, రాఘవేందర్‌, జంగం యాదయ్య, బుడ్డన్న, రాములు, రాములన్న, తిరుపతి ఉన్నారు.



వాటర్‌ బాటిల్స్‌, కూలింగ్‌ అద్దాల పంపిణీ



మహబూబ్‌నగర్‌ క్రైం: ఎండ తీవ్రత అధికంగా ఉన్న నేపథ్యంలో ట్రాఫిక్‌ కానిస్టేబుల్స్‌ ఆరోగ్యం కాపాడుకోవడం చాలా ముఖ్యమని ఎస్పీ కె.నరసింహ అన్నారు. రాష్ట్ర డీజీపీ అంజనీకుమార్‌ ఆదేశాలు మేరకు శ్రీమాన్‌ గ్రూప్స్‌, ప్రపంచ వినియోదారుల హక్కుల సంస్థ సహకారంతో అందించిన కూల్‌ వాటర్‌ బాటిల్స్‌, కూలింగ్‌ అద్దాలను బుధవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో ట్రాఫిక్‌ పోలీస్‌ సిబ్బందికి అందజేశారు. ట్రాఫిక్‌ సిబ్బంది సంక్షేమానికి అన్ని వేళలా కృషి చేస్తామన్నారు. అదనపు ఎస్పీలు రాములు, సురేష్‌కుమార్‌, శ్రీనివాసులు, ట్రాఫిక్‌ సీఐ అశోక్‌, శ్రీమాన్‌ అధినేత అనూప్‌ చక్రవర్తి, బలగం పూర్ణచందర్‌గౌడ్‌ పాల్గొన్నారు.

వీసీగా పనిచేయడం అదృష్టం



వీసీకి శుభాకాంక్షలు తెలుపుతున్న సిబ్బంది

మహబూబ్‌నగర్‌ ఎడ్యుకేషన్‌: పాలమూరు యూనివర్సిటీ వైస్‌ఛాన్స్‌లర్‌గా లక్ష్మీకాంత్‌ రాథోడ్‌ బాధ్యతలు స్వీకరించి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా పీయూ అధికారులు, సిబ్బంది ఆయనకు బుధవారం పుష్పగుచ్ఛంతో శుభాకాంక్షలు తెలిపారు. ఈమేరకు వీసీ మాట్లాడుతూ తాను బాధ్యతలు స్వీకరించాక పలు అభివృద్ధి పనులు చేశానని, మరిన్ని పనులు పెండింగ్‌లో ఉన్నాయని వాటిని పూర్తి చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. వీసీగా పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నానని వివరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్‌ గిరిజ, ఓఎస్డీ మధుసూదన్‌రెడ్డి, అధ్యాపకులు పిండి పవన్‌కుమార్‌, అర్జున్‌కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

'ప్రభుత్వ భూమి కబ్జాను ఆపాలి'



జెడ్పీసెంటర్‌(మహబూబ్‌నగర్‌) : మిడ్జిల్‌ మండలంలోని వేములలో 217 సర్వే నెంబర్‌ ప్రభుత్వ భూమిలో ఉన్న ప్రభుత్వ గోదాములను తొలగించి ఆ భూమిని కబ్జా చేసేందుకు గ్రామానికి చెందిన కొంతమంది బడా బాబులు ప్రయత్నిస్తున్నారని ఆ గ్రామానికి చెందిన దళితులు ఆరోపిస్తున్నారు. ఈ మేరకు బుధవారం జిల్లా అడిషనల్‌ కలెక్టర్‌ సీతారామారావుకు వినతి పత్రం సమర్పించారు. వేముల సర్పంచ్‌ జంగయ్య 1954లో అప్పటి ప్రభుత్వం సర్వే నెంబర్‌ 274లో గ్రామానికి చెందిన 76 దళిత కుటుంబాలకు ఒక్కొక్క కుటుంబానికి 3 ఎకరాల చొప్పున గైరాన్‌ భూమిని పట్టాలు ఇచ్చిందని తెలిపారు. ఈ భూమిలో పండించిన పంటను, పశువులను, వ్యవసాయ పనిముట్లను దాచుకోవడానికి అదే గ్రామంలో 217 సర్వే నెంబర్‌లో ప్రభుత్వ ఖర్చులతో రెండు గోదాములను నిర్మించిందని అన్నారు. కాగా గోదాములకు అనుకుని ఉన్న పట్టా భూమి యజమాని ఆంజనేయులు రియల్‌ ఎస్టేట్‌ వ్యాపారి అయిన గోపాల్‌రెడ్డికి కట్టబెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. జేసీబీలతో ఆ గోదాములను తొలగించి భూమిని కాజేసేందుకు ప్రయత్నిస్తున్నాడని అన్నారు. భూమిని నమ్ముకుని జీవిస్తున్న తమకు న్యాయం చేయాలని కోరారు.

అర్హులందరికీ 'డబుల్‌' ఇళ్లు



లబ్ధిదారులను ఎంపిక చేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

జడ్చర్ల: అర్హులందరికీ డబుల్‌ బెడ్‌ రూమ్‌ ఇళ్లు కేటాయించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్‌ సి.లక్ష్మారెడ్డి తెలిపారు. డబుల్‌బెడ్‌ రూమ్‌ ఇళ్ల కేటాయింపుపై బుధవారం స్థానిక నిమ్మబాయిగడ్డ ప్రాంతంలోని 16, 17వ వార్డులలో స్వయంగా ప్రతి ఇంటికి వెళ్లి విచారించారు. ఇరుకు ఇంటిలో రెండు, మూడు కుటుంబాలు కలిసి ఉండడం లేదా ఇల్లు లేకుండా అద్దె ఇంటిలో ఉంటూ కూలీ పనులు చేసుకునే వారిని విచారించి అర్హులను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇళ్ల కేటాయింపు పూర్తిగా పారదర్శకంగా ఉండడం కోసం తానే స్వయంగా లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నట్లు వివరించారు. ఇళ్లతో పాటు ఖాళీ స్థలం ఉన్న వారికి ఇంటి నిర్మాణం కోసమూ లబ్ధిదారులను ఎంపిక చేశామని వివరించారు. ఇందులో ఎలాంటి పైరవీలకు తావులేదన్నారు. వచ్చే నెలలో వీరందరికి ఇళ్ల పంపిణీ చేస్తామన్నారు. ఎర్రగుట్టలో దాదాపు 560 ఇళ్లు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని వివరించారు. అదేవిధంగా హరిజనవాడ, ఫకీర్‌ నగర్‌, పాతబజార్‌, కావేరమ్మపేట, చర్లపల్లి, బుడగజంగాల కాలనీ తదితర చోట్ల దాదాపు 2 వేల ఇళ్లు పంపిణీ చేస్తామన్నారు.

వంద పడకల ఆస్పత్రి పరిశీలన

జడ్చర్ల–గంగాపూర్‌ రోడ్‌ శివారులో నిర్మించిన వంద పడకల ఆస్పత్రి భవనాన్ని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి పరిశీలించారు. అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని స్థానిక అధికారులకు సూచించారు. ఈనెల 27న రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీష్‌రావు భవనాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. దాదాపు రూ.33 కోట్ల వ్యయంతో నిర్మించిన ఆస్పత్రిలో అన్ని సౌకర్యాలు కల్పించినట్లు వివరించారు. మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ లక్ష్మి, తహసీల్దార్‌ లక్ష్మీనారాయణ, కమిషనర్‌ షేక్‌, స్థానిక కౌన్సిలర్లు పాల్గొన్నారు.

సర్పంచ్‌ల ఆధ్వర్యంలో సన్మానం

జడ్చర్ల టౌన్‌: గ్రామ పంచాయతీలకు నిధులు విడుదల చేయడంపై జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు ప్రణీల్‌ చందర్‌ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే డా.లక్ష్మారెడ్డిని ఘనంగా సత్కరించారు. డీసీఎంఎస్‌ చైర్మన్‌ ప్రభాకర్‌రెడ్డి, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

రానున్నది కాంగ్రెస్‌ ప్రభుత్వమే

బాలానగర్‌: మండల కేంద్రంలో జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్‌ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండల ప్రధాన కార్యదర్శి తిరుపతి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఎర్ర శేఖర్‌ విచ్చేయగా గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్నది కాంగ్రెస్‌ ప్రభుత్వమే అని, పార్టీని నమ్మి కష్టపడ్డవారికి తగిన గుర్తింపు ఉంటుందని అన్నారు. హరిసింగ్‌, హనుమంత్‌ నాయక్‌, గోవర్ధన్‌, దత్తు, భాస్కర్‌, యాదయ్య, వెంకటేష్‌ తదితరులు పాల్గొన్నారు.

హైమాస్ట్‌ లైట్స్‌ ప్రారంభం

మిడ్జిల్‌: జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్‌ జన్మదినం సందర్భంగా వాడ్యాల్‌ స్టేజీ వద్ద గ్రామ కాంగ్రెస్‌ నాయకులు విజయ్‌కుమార్‌ నూతనంగా హైమాస్ట్‌ లైట్స్‌ ఏర్పాటు చేయించారు. ఈ మేరకు బుధవారం ఎర్ర శేఖర్‌ ప్రారంభించారు. మండల అధ్యక్షుడు అల్వాల్‌రెడ్డి, విజయ్‌కుమార్‌, నిఖిల్‌రెడ్డి, సాయిలు, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

భరోసా కల్పించడానికే బహిరంగసభ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్‌ మల్లురవి

స్టేషన్‌ మహబూబ్‌నగర్‌: ప్రజల్లో భరోసా కల్పించడానికే జడ్చర్లలో గురువారం సాయంత్రం బహిరంగసభ నిర్వహిస్తున్నట్లు టీపీసీసీ సీనియర్‌ ఉపాధ్యక్షుడు డాక్టర్‌ మల్లురవి తెలిపారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్‌ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్‌ అధికారంలోకి వస్తే అర్హులైన వారికి ఇంటి నిర్మాణం కోసం రూ.5లక్షలు ఇస్తామన్నారు. ధరణి పోర్టల్‌ను రద్దు చేసి రైతులకు అనుకూలమైన విధానాన్ని తీసుకొస్తామని తెలిపారు. ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీ, 2 లక్షల ఉద్యోగాల భర్తీ, రూ.4 వేల నిరుద్యోగ భృతి అందజేస్తామని తెలిపారు. బహిరంగసభలో హిమాచల్‌ప్రదేశ్‌ సీఎం సుఖ్వీందర్‌ సింగ్‌ సుక్కు, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి తదితర నాయకులు పాల్గొంటారని తెలిపారు. టీపీసీసీ సీనియర్‌ ఉపాధ్యక్షుడు చెరుకు సుధాకర్‌ ఉదండాపూర్‌ నిర్వాసితులను ప్రభుత్వం పరిహారం చెల్లించడం లేదన్నారు. దళితుల పై ఇటీవల మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌ చేసిన వాఖ్యలు సరికాదన్నారు. సమావేశంలో డీసీసీ అధ్యక్షులు జి.మధుసూదన్‌రెడ్డి, డాక్టర్‌ వంశీకృష్ణ, శ్రీహరి, రాజేంద్రప్రసాద్‌, టీపీసీసీ ఉపాధ్యక్షులు ఒబేదుల్లా కొత్వాల్‌, రమేశ్‌ ముదిరాజ్‌, ప్రధాన కార్యదర్శులు వినోద్‌కుమార్‌, సంజీవ్‌ ముదిరాజ్‌, ప్రదీప్‌గౌడ్‌, బడంగ్‌పేట్‌ మేయర్‌ పారిజాత, నాయకులు పాల్గొన్నారు.

సభకు సర్వం సిద్ధం

జడ్చర్ల: పట్టణంలోని బీఆర్‌ఆర్‌ ప్రభుత్వ డిగ్రీకళాశాల మైదానంలో గురువారం సాయంత్రం నిర్వహించనున్న బహిరంగ సభకు సర్వం సిద్ధం చేశారు. గంగాపూర్‌ రోడ్డు సమీపంలో వాహనాల పార్కింగ్‌కు స్థలాన్ని ఖరారు చేశారు. టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్లురవి, సెక్రటరీ అనిరుధ్‌రెడ్డి తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కేసీఆర్‌ చిత్రపటానికి క్షీరాభిషేకం



మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌కు ధన్యవాదాలు తెలుపుతున్న జేపీఎస్‌లు

అడ్డాకుల: మండల కేంద్రంలోని మండల పరిషత్‌ కార్యాలయం వద్ద బుధవారం జూనియర్‌ పంచాయతీ కార్యదర్శులు సీఎం కేసీఆర్‌ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అంతకు ముందు ఎంపీపీ నాగార్జున్‌రెడ్డి, జెడ్పీటీసీ రాజశేఖర్‌రెడ్డి, విండో అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి, రైతు బంధు అధ్యక్షుడు తిరుపతిరెడ్డిని కార్యదర్శులు సన్మానించారు. కార్యదర్శులు సాజిద్‌, చంద్రశేఖర్‌, అమానుల్లా, విజయకుమార్‌, కల్యాణి, సౌజన్య, శిరీష, విజయశ్రీ, సరస్వతి, శైలజ, అంజనేయులు తదితరులు ఉన్నారు.

హన్వాడ: గ్రామ పంచాయతీ కార్యదర్శుల రెగ్యులరైజేషన్‌పై సీఎం కేసీఆర్‌, మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌ల చిత్రపటాలకు బుధవారం పాలభిషేకం చేశారు. ఎంపీపీ బాల్‌రాజ్‌, ఎంపీడీఓ ధనుంజయ్‌ గౌడ్‌ తదితరులు పాల్గొన్నారు.

కార్యదర్శులకు అండగా ఉంటాం

జడ్చర్ల టౌన్‌: పంచాయతీ కార్యదర్శులకు అండగా ఉంటామని ఎమ్మెల్యే డా. లక్ష్మారెడ్డి స్పష్టం చేశారు. ఎమ్మెల్యే క్యాంప్‌ కార్యాలయంలో బుధవారం కార్యదర్శులు ఆయనను సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెగ్యులరైజేషన్‌ తరువాత గ్రామాల్లో రెట్టింపు ఉత్సాహంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా మండలాల కార్యదర్శులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన జేపీఎస్‌లు

జెడ్పీసెంటర్‌(మహబూబ్‌నగర్‌): జూనియర్‌ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులరైజేషన్‌ ప్రారంభించడంతో బుధవారం మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌ను ఫాం హౌజ్‌లో హన్వాడ మండలానికి చెందిన జేపీఎస్‌లు కలిశారు. రెగ్యులరైజేషన్‌కు కృషి చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఎంపీడీఓ ధనుంజయ, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆశా కార్యకర్తల ఆందోళన

రాజాపూర్‌: మండల కేంద్రంలో బుధవారం ఆశా కార్యకర్తలు ఆందోళన చేపట్టారు. స్థానిక పీహెచ్‌సీ పరిధి తిర్మలాపూర్‌లో ఏఎన్‌ఎంగా విధులు నిర్వహిస్తున్న సుజాత రాఘవాపూర్‌ ఆశావర్కర్‌ జ్యోతిపై దుర్భాషలాడటంతో ఆమె చెరువులో దూకి ఆత్మహత్య యత్నానికి పాల్పడిందని కార్యకర్తలు అన్నారు. ఈ మేరకు ఏఎన్‌ఎంపై చర్యలు తీసుకోవాలని జాతీయ రహదారిపై ఆందోళన చేపట్టినట్లు వివరించారు. అనంతరం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాగా ఆశావర్కర్‌ జ్యోతి తన భర్త అశోక్‌ గొడవ పడడంతో ఆత్మహత్య యత్నం చేసిందని కొందరు కావాలనే రాజకీయం చేశారని రాఘవాపూర్‌ గ్రామస్తులు పలువురు వివరణ ఇచ్చారు. విధులను సక్రమంగా నిర్వహించాలని ఏఎన్‌ఎం సుజాత చెప్పడం ఎలాంటి తప్పుకాదని గ్రామస్తులు పేర్కొన్నారు.

నేటి సభకు భారీగా జన సమీకరణ

నవాబుపేట: జడ్చర్లలో జరిగే కాంగ్రెస్‌ బహిరంగసభకు మండలం నుండి పెద్ద ఎత్తున జన సమీకరణ చేస్తున్నట్లు డీసీసీ అధికార ప్రతినిధి దుశ్యంత్‌రెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా బుధవారం మండల కేంద్రంలో ముఖ్యనాయకుల సమావేశం ఏర్పాటు చేశారు. తులసీరాంనాయక్‌, అంజీ, కుమార్‌, పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

మండల కేంద్రంలో భట్టి పాదయాత్ర సందర్భంగా ఈ నెల 17న బాణాసంచా కాలుస్తున్న తరుణంలో రోడ్డు పక్కన ఉన్న ఫర్నీచర్‌ దుకాణంలో మంటలు అంటుకున్నాయి. పాక్షికంగా నష్టం జరగడంతో పీసీసీ ఉపాధ్యక్షుడు అనిరుధ్‌రెడ్డి ఆర్థికసాయం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ మేరకు బుధవారం డీసీసీ అధికార ప్రతినిధి దుశ్యంత్‌రెడ్డి బాధితుడు కేశవులుకు రూ.10 వేలు అందజేశారు.